క్లుప్తంగా

అసెంబ్లీలో పర్వతగిరి రిజర్వాయర్‌పై చర్చ



పర్వతగిరి : అసెంబ్లీ సమావేశాల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పర్వతగిరి రిజర్వాయర్‌పై చర్చించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పర్వతగిరిలోని పెద్ద చెరువును రిజర్వాయర్‌గా చేశారని, నాసిరకంగా పనులు చేసి రూ.80 కోట్లు బిల్లు తీసుకున్నారని ఆరోపించారు. దీనిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశామని, ఇంకా విచారణలో ఉందన్నారు. రిజర్వాయర్ కింద సుమారు మూడు వేల ఆయకట్టు ఉందని, గత ప్రభుత్వం గుర్తించకపోవడంతో భూమి అన్యాక్రాంతమైందని పేర్కొన్నారు. త్వరలోనే దీనిపై దర్యాప్తు ముమ్మరం చేసి రైతులకు న్యాయం చేసి, ఆయకట్టును కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడినందుకు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు స్పందించి ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని కోరారు.

తైబజార్ వేలం ఖరారు



పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ తైబజార్ వేలం ఖరారైనట్లు మండల పంచాయతీ అధికారి, అన్నారం షరీఫ్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి పాక శ్రీనివాస్ ప్రకటించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం తైబజార్ వేలం నిర్వహించగా ఐదుగురు వ్యక్తులు పాల్గొని పాట పాడారు. అన్నారం గ్రామానికి చెందిన షేక్ సమ్రీన్ సలేహా అత్యధికంగా రూ.37.65 లక్షలకు పాడి టెండరు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారి, ప్రత్యేక అధికారి శ్రీనివాస్ మాట్లాడారు. వేలం పాటను ఖరారు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి మోహిన్, బిల్ కలెక్టర్ గుండా యాకయ్య, సిబ్బంది రామచంద్రు, తదితరులు పాల్గొన్నారు.

26న సొసైటీ మహాసభ

నర్సంపేట : ఈనెల 26న చెన్నారావుపేట సొసైటీ 68వ సాధారణ మహాసభ నిర్వహిస్తున్నట్లు సీఈఓ చిట్టి రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ కార్యాలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పర్సన్ ఇన్‌చార్జి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థికసాయం



సంగెం : మండలంలోని లోహితకు చెందిన గౌడ సంఘం సభ్యుడు బొమ్మగాని రవీందర్ ఇటీవల మృతి చెందగా అతడు కౌండిన్య పరపతి సంఘం సభ్యుడు కావడంతో బాధిత కుటుంబానికి సంఘం ప్రతినిధులు శనివారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత రవీందర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఉమేందర్, యాదగిరి, రమేశ్, శ్రీనివాస్, వెంకన్న, రంజిత్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌కు గాయాలు

రాయపర్తి : ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఆటోడ్రైవర్ గాయాల పాలయ్యాడు. మండల కేంద్రం శివారులోని హెచ్‌పీ గ్యాస్ గోదాము సమీపంలో శనివారం ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా.. మండల కేంద్రానికి చెందిన చెవ్వ జంపయ్య కేసీఆర్ కాలనీలో నివాసం ఉంటూ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న లారీ ఆయన నడుపుతున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు కాగా జంపయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు జంపయ్యను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

కళాశాలల ప్రచారం తగదు

దుగ్గొండి : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ప్రైవేట్ కళాశాలలు ప్రచారం చేయడం తగదని ఏబీవీపీ జిల్లా కార్యదర్శి నరేశ్ అన్నారు. మండలంలోని మల్లంపల్లిలోని పరీక్షా కేంద్రం వద్ద అవని కళాశాల బ్రోచర్లతో ప్రచారం చేస్తుండగా ఆయన ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడారు. విద్యాసంవత్సరం ముగియక ముందే ఐఐటీ, నీట్ పేర్లతో ప్రచారం చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పథకంలో మార్పులు చేయాలి

నల్లబెల్లి : ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించే పేరుతో ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో మార్పులు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. తెల్ల రేషన్ కార్డుతో నిమిత్తం లేకుండా, వయో పరిమితిని 45 ఏళ్లకు పెంచాలని, ఓసీ పేదలకు పథకాన్ని వర్తింపచేయాలని కోరారు.

మొక్కజొన్న సాగుకే మొగ్గు

● యాసంగిలో పెరిగిన విస్తీర్ణం



సూరిపల్లిలో సాగు చేస్తున్న మొక్కజొన్న

నెక్కొండ : మండల రైతులు మొక్కజొన్న సాగుకే మొగ్గు చూపుతున్నారు. యాసంగిలో గతంలో ఎన్నడూ లేని విధంగా మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. గతేడాది ఖరీఫ్‌లో వరి, పత్తి పంటలను సాగు చేసిన రైతులు సరైన వర్షాలు కురవక, ఆశించిన మేర పంటల దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ పంటల దిశగా రైతులు దృష్టి సారించారు. పత్తి పంటను తొలగించి మొక్కజొన్న సాగు చేస్తున్నారు. పంట సాగుకు నీరు తక్కువ మోతాదులో అవసరం ఉండడంతో మండల రైతులు మొక్కజొన్న సాగుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

మండలంలో సాగు ఇలా..

మండలంలోని చంద్రుగొండలో 1150, రెడ్లవాడలో 1100, అప్పల్‌రావుపేటలో 1050, దీక్షకుంటలో 550, అలంకానిపేటలో 850, నాగారంలో 550, పెద్దకొర్పోలులో 820, మిగతా గ్రామాల్లో 4.630 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. వరి పంట సాగుకు భారీగా పెట్టుబడులు అవసరం కావడంతోపాటు కూలీల కొరత, ఇతర సమస్యల నేపథ్యంలో యాసంగిలో మండలానికి చెందిన పలువురు రైతులు ఆరుతడి పంటలు సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. కొందరు రైతులు 10 ఎకరాల చొప్పున మొక్కజొన్న సాగు చేసి తక్కువ పంట కాలంలో, తక్కువ పెట్టుబడితో ఎకరానికి సుమారు 30–35 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తామన్న ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొక్కజొన్న పంటలకు మద్దతు ధర రూ.2225 ప్రకటించడంతో మెరుగైన ఆదాయం ఉంటుందని అన్నదాతలు ఆశిస్తున్నారు.

ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న..



మాది ఉమ్మడి కుటుంబం. ఖరీఫ్‌లో 3 ఎకరాల్లో వరి, 10 ఎకరాల్లో పత్తి సాగు చేశాము. వరిలో ఆశించిన దిగుబడులు రాలేదు. చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలతో పత్తి చేను జాలు పట్టి నష్టం కలిగించింది. ఇతర పంటల సాగుకు పెట్టుబడి ఎక్కువ. ప్రత్యామ్నాయంగా తక్కువ పెట్టుబడితో 10 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాము.

– పెండ్లి రవి, రైతు, సాయిరెడ్డిపల్లి

తక్కువ పెట్టుబడితో...



యాసంగిలో రైతులు 10,700 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. గతేడాదితో పోల్చితే 700 ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది. అనుకూలంగా ఉన్న బావులు, ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సాగు నీరు అందుతుండడంతో పంటలకు తిప్పలు తప్పాయి. ఇప్పుడిప్పుడే కొన్నిచోట్ల మొక్కజొన్న పంట విక్రయాలు మొదలవుతున్నాయి.

– ఎగిడి నాగరాజు, ఏఓ

నీటి పొదుపు తప్పనిసరి



నర్సంపేట : మాట్లాడుతున్న నాగరాజు



పర్వతగిరి : రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌కు ముగ్గు పోస్తున్న అధికారులు

● మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు

నర్సంపేట : సమాజంలోని ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవడం తప్పనిసరి అని స్థానిక మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు స్పష్టం చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, జిల్లా నీటి పారుదల శాఖలతోపాటు ప్రతిభ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రపంచ నీటి దినోత్సవ కార్యక్రమానికి నాగరాజు హాజరై మాట్లాడారు. పట్టణీకరణతో అడవులు అంతరించి భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణం సందర్భంగా ఖచ్చితంగా ఇంకుడు గుంత నిర్మించుకోవాల్సిందేనని చెప్పారు. ప్రతిభ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ నీటి పొదుపుపై ప్రజలు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్, మున్సిపల్ మేనేజర్ సంపత్‌కుమార్, ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ రాజు, వినియోగదారుల విజిలెన్స్ కమిటీ మెంబర్ సారంగం, ఉద్యోగులు సూర్యతేజ, శివ, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాల్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు ప్లకార్డులు తయారు చేసి ఆవిష్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు అర్పిత మాట్లాడారు. భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సాదత్, చంద్రకళ, నాగరాణి, రాయబోస్, రవికుమార్, రవీందర్, రమేశ్, రాజేశ్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని వంచనగిరి జెడ్పీ హైస్కూల్‌లో బాలవికాస సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులతో నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కమల, సత్యనారాయణ, బాలవికాస ప్రతినిధి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల పరిషత్, తహసీల్ కార్యాలయాల ఆవరణలో రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణానికి ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్, తహసీల్దార్ వెంకటస్వామి ముగ్గు పోశారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమాల్లో ఎంపీఓ పాక శ్రీనివాస్, అనిల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి, తొగర్రాయి, తిమ్మంపేట గ్రామాల్లో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు జ్యోతిలక్ష్మి, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, బాలవికాస ప్రతినిధులు శ్రీదేవి, రమాదేవి, సంధ్యారాణి, రజిత, దేవేంద్ర, లక్ష్మి, వాటర్ ప్లాంట్ల ప్రతినిధులు కృష్ణారెడ్డి, చంద్రమౌళి, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ



వర్ధన్నపేట : పట్టణానికి చెందిన కొండేటి సుప్రియ చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో ఎంఎస్సీ బయోటెక్నాలజీ కోర్సులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. తన బ్యాచ్‌లో టాపర్‌గా నిలిచింది. సుప్రియ తండ్రి శ్రీనివాస్ ఆర్‌ఎంపీగా పని చేస్తూ కడు పేదరికంలో కూతురును ఉన్నత విద్య చదివిస్తున్నాడు. సుప్రియ సైతం తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చేలా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ దక్కించుకుంది. సుప్రియను శనివారం పలువురు ప్రముఖులు అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని లింగగిరిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ ప్రత్యేక అధికారి, మిషన్ భగీరథ ఇంట్రా ఏఈ రణధీర్ శనివారం ప్రారంభించారు. అనంతరం రణధీర్ మాట్లాడారు. మార్చి మొదటి వారం నుంచే వేసవి ప్రారంభం కాగా ఎండలు ఠారెత్తుతున్నాయని చెప్పారు. బాటసారుల, గ్రామం మీదుగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారి దాహార్తిని తీర్చేలా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పడిదం కట్టస్వామి, పంచాయతీ కార్యదర్శి శ్యాంప్రసాద్, కారోబార్ దాసరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

దమ్మన్నపేటలో..



వర్ధన్నపేట : మండలంలోని దమ్మన్నపేటలో చలివేంద్రాన్ని మండల పంచాయతీ అధికారి అంకం ధనలక్ష్మి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. నీటి సంరక్షణ, నీటి పొదుపు గురించి ప్రజలకు వివరించారు. నీటిని పొదుపుగా వినియోగించే దిశగా ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు.

చిన్నారి వైద్యానికి సాయం

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన తాళ్లపెల్లి రమేశ్–నాగరాణి దంపతుల కూతురు వైద్యం కోసం ఏనుగుల మంజుల సాంబరెడ్డి దంపతులు శనివారం రూ.3 వేల సాయం అందజేశారు. వారు పంపిన నగదును సాంబరెడ్డికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు కర్ణకంటి రామ్మూర్తి అందజేశారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



విద్యార్థులతో హెచ్‌ఎం సుధాకర్, ఇన్‌చార్జ్ ఫిజానాస్, ఉపాధ్యాయులు

సంగెం : మండలంలోని మొండ్రాయిలోని సిద్ధార్థ స్కూల్‌లో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అవసరమైన బోధనోపకరణాలు సమకూర్చుకుని సమయపాలన పాటిస్తూ సమయ సారిణితో బోధించిన తీరు ఆకర్షించింది. డీఈఓగా కృతిక తేజ, ప్రధానోపాధ్యాయుడుగా మాదినేని సాకేత్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఎం.హర్షిత, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్‌ఎం సుధాకర్ బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఫిజానాస్, ఉపాధ్యాయులు నాగమణి, వందన, స్వప్న, కవిత, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

నర్సంపేట : పట్టణంలోని సర్వే నంబర్ 121లోని ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలని భూపోరాట కమిటీ గౌరవ అధ్యక్షుడు గనిపాక సంజీవ, అధ్యక్షుడు మంద ప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆర్డీఓకు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రకాశ్ మాట్లాడారు. సదరు భూమిలో అక్రమ కట్టడాలను నిరసిస్తూ ఇటీవల వాటర్ ట్యాంకు ఎక్కిన దళిత నాయకులు, మహిళ కమిటీ సభ్యులు నిరసన తెలపగా అక్రమ కట్టడాలని నిలిపేస్తామని ఆర్డీఓ, తహసీల్దార్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. భవన నిర్మాణానికి అవసరమైన సామగ్రిని తొలగించలేదన్నారు. మళ్లీ ఏ రాత్రి అయినా నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉందన్నారు. సుమారు 15 ఏళ్ల క్రితం అదే భూమిలో గుడిసెలు వేసిన 22 మంది దళితులపై పోలీసులు కేసులు బనాయించి ఏడేళ్లపాటు కోర్టు చుట్టూ తిప్పి ఆర్థికంగా, సామాజికంగా నష్టం కలిగించారని తెలిపారు. గత ప్రభుత్వం అంబేడ్కర్ భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనలు విరమించామని, మళ్లీ ప్రస్తుతం కబ్జాకు గురైతే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. సదరు భూమిని పేద దళితులకు కేటాయించాలని లేదా అంబేడ్కర్ భవనాన్ని నిర్మించాలని ఆకాంక్షించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు మాదాసి సదానందం, మంద ప్రభాకర్, వేల్పుగొండ రాజు, బొచ్చు వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఒకరికొకరు తోడూనీడగా..



రాయపర్తి : కష్టసుఖాల్లో భార్యాభర్తలు ఒకరికొకరు తోడూనీడగా నిలవడం ఆదర్శం. కానీ ఆరోగ్యం బాగాలేని భార్యను వెంటే ఉంచుకుని వలస జీవితం సాగించడం అరుదు. కుటుంబ పోషణ కోసం ఏర్పాటు చేసుకున్న బండిలోనే కూతురుతో కలిసి వలస జీవనం సాగిస్తున్న దంపతులు శనివారం 'సాక్షి' కెమెరాకు చిక్కారు. వివరాలిలా.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన నందిని–వెంకటేశ్ దంపతులు ఏడేళ్ల క్రితం మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరుకు వలస వచ్చారు. నిలువ నీడలేని దంపతులు పొట్టపోసుకునేందుకు ఓ వాహనం తయారు చేసుకుని ఊరి చివర ఉంటూ కూలీనాలీ చేస్తూ బతుకు సాగిస్తున్నారు. ఈ క్రమంలో నందిని ఇటీవల ఫిట్స్‌కు గురైంది. నిత్యం ఒకరు వెన్నంటి ఉంటే తప్ప ఎప్పుడు ఫిట్స్‌కు ఆమె గురయ్యేది తెలియని పరిస్థితి. దీంతో నందిని వెంకటేశ్ దంపతులు వాహనంలోనే సంచార జీవనాన్ని సాగిస్తున్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధే ధ్యేయం

● జోనల్ ఆఫీసర్ స్వరూపారాణి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జోనల్ ఆఫీసర్, తదితరులు

పర్వతగిరి : విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా సాంఘిక సంక్షేమ (గురుకుల) రెసిడెన్షియల్ కళాశాలల్లో బోధన సాగుతోందని జోనల్ ఆఫీసర్ స్వరూపారాణి తెలిపారు. మండలంలోని పీఎం శ్రీ టీజీఎస్ డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అపర్ణ ఆధ్వర్యంలో వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రతిభ, సృజనాత్మకత ప్రదర్శించారు. స్వయంగా రూపొందించిన సంగీత ప్రదర్శన చేపట్టారు. విద్యార్థులు రాసిన పాటలను అందుబాటులో ఉన్న సాధనాలతో స్వరపర్చి ఆహూతులను అబ్బురపర్చారు. భారతదేశ సాంప్రదాయ వైవిధ్యాన్ని ప్రతిధ్వనించేలా 'మిలే సుర్ మేరా తుమ్హారా' పాటకు నృత్య చేసి ఆశ్చర్య చకితులను చేశారు. దాదాపు 25 అడుగుల పొడవున్న భారతదేశ పటాన్ని రూపొందించి అన్ని రాష్ట్రాలను అందులో వివరించడంతోపాటు ప్రత్యేకతలను తెలిపేలా ప్రదర్శన నిర్వహించారు. హర్యానా నృత్య ప్రదర్శన, కరాటే, యోగాసనాలు, పిరమిడ్ శిల్పాలు వంటి వినూత్న కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా జోనల్ ఆఫీసర్ స్వరూపరాణి ప్రిన్సిపాల్ అపర్ణ, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ శంకర్, ఎంఈఓ లింగారెడ్డి, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే 'సఖి' సేవల సద్వినియోగం

● కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న



పోస్టర్లను ప్రదర్శిస్తున్న తిరుమల, తదితరులు

వర్ధన్నపేట : మహిళలు, బాలికలు అవగాహన పెంచుకోవడం ద్వారానే సఖి–వన్‌స్టాప్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోగలరని కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న స్పష్టం చేశారు. మండలంలోని కుమ్మరిగూడెం, బొక్కలగూడెం గ్రామాల్లో శనివారం నిర్వహించిన అవగాహనా సదస్సుల్లో వారు మాట్లాడారు. సమాజం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న క్రమంలో మహిళలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని చెప్పారు. అయినప్పటికీ పలువురు మహిళలు, బాలికలు వరకట్న, లైంగిక, ఇతర వేధింపులకు గురౌతూ మానసిక వేదన అనుభవిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. విద్యావంతులైన మహిళలు, ఉద్యోగినులు సైతం గర్భవిచ్ఛిత్తి, పని ప్రదేశాల్లో వేధింపుల్లాంటి సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. బాలికలు సైతం పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్త్రీ శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సఖి–వన్‌స్టాప్ సెంటర్లు ఏర్పాటు చేసి బాధిత మహిళలకు, బాలికలకు కౌన్సిలింగ్‌తోపాటు న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళల, బాలికల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయని చెప్పారు. సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు, బాలికలు 100, 181, 1098, 14567 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమాల్లో వీఓఏ యాకలక్ష్మి, రమ, తదితరులు పాల్గొన్నారు.

'యువవికాసం'ను వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

నల్లబెల్లి : నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6 వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రాజకీయాలకు అతీతంగా అర్హులను ఎంపిక చేయడానికి కసరత్తు చేస్తున్నారని తెలిపారు. ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం అదే నెల 6 నుంచి మే 31 వరకు పరిశీలన ఉంటుందని, జూన్ 2న రుణాలు మంజూరు చేస్తారని వివరించారు. సమావేశంలో ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, మండల ప్రధాన కార్యదర్శి శార్ల శివారెడ్డి, నాయకులు ఇస్తారు శేఖర్, మాలోతు మోహన్, పురుషోత్తం, సురేశ్, బత్తిని మహేశ్, సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు పోరాడాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాలరాజు, రాజేందర్, తదితరులు

● ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బాలరాజు

నర్సంపేట : పాలకులు అవలంబిస్తున్న తప్పుడు విధానాలపై భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు పోరాడాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ కోరారు. పట్టణంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాల పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలరాజు, రాజేందర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్ఈపీ 20–20, యూజీసీ ముసాయిదాలను రద్దు చేసేలా, హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాల ఆందోళనలపై నిషేధం ఎత్తివేత, తదితరాల కోసం ఉద్యమించాలని సూచించారు. ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గట్టి కృష్ణ, జిల్లా నాయకుడు భోగి సారంగపాణి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిలివేరు పూలక్క, నాయకులు గుగులోతు భద్రాజి, భీమగాని మల్లయ్య, బరిగల కుమార్, గొర్రె ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం



నర్సంపేట : అరెస్టైన కార్మిక నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : అరెస్టులు అప్రజాస్వామికమని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అనంతగిరి రవి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ గుంపెల్లి మునీశ్వర్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం సదానందం, తదితర నాయకులు అన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమ నేపథ్యంలో నర్సంపేట, ఖానాపురం, తదితర మండలాలకు చెందిన పలువురు నాయకులను పోలీసులు శనివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని వ్యక్తిగత పూచీకత్తుపై సాయంత్రం వదిలేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వ తీరును ఖండించారు.